క్లుప్తంగా

భక్తశ్రద్ధలతో మొహర్రం



పీర్ల ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురంరూరల్: ప్రాణత్యాగాలకు ప్రతీకగా నిర్వహించే పీర్ల పండుగ, మొహర్రం ను నరసాపురం పట్టణంలో శనివారం నిర్వహించారు. నరసాపురంలోని రైతుబజార్ పక్కన రోడ్డులో ఉన్న ఈ పీర్ల కొట్టాం నుంచి కొండాసాహెబ్ పీర్ల పండుగను పురస్కరించుకుని మోహర్రానికి 11 రోజుల ముందు నుంచి పంజాలోని పీర్లకు పూజలు చేస్తున్నారు. మొహర్రాన్ని పురస్కరించుకుని శనివారం పీర్లను ఊరేగింపుగా పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపుగా తిరిగారు. ఈ సందర్భంగా పలువురు పీర్లకు మొక్కులు సమర్పించారు.

ముగిసిన సీఐటీయూ జిల్లా వర్క్‌షాప్



మార్టేరులో మాట్లాడుతున్న రాజారామ్మోహన్‌రాయ్

పెనుమంట్ర: ఉద్యోగ కార్మికుల సమస్యలు పరిష్కారానికి పోరాటాలు తప్ప మరో మార్గం లేదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్‌రాయ్ అన్నారు. సీఐటీయూ జిల్లా వర్క్‌షాప్ మార్టేరులో శనివారం ముగిసింది. ఈసందర్భంగా రాజా రామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ అన్ని ఉద్యోగ కార్మిక సంఘాలు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఆందోళనకు పిలుపునిచ్చాయని, ఈఆందోళన కార్యక్రమాలలో జిల్లాలోని ఆయా రంగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరరావు, కర్రి నాగేశ్వరరావు ఎం.ఆంజనేయులు, ఎస్.వెంకటేశ్వరరావు, ఎన్.రంగారావు, పీవీ ప్రతాప్, అజయ్‌కుమారి పాల్గొన్నారు.

ఊపిరి పీల్చుకున్న రైతులు



గొల్లగూడెంలో నీరు లాగిన ఆకుమడి

మొగల్తూరు: గత రెండు రోజులుగా వర్షం కురవకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. గత ఆదివారం నుంచి గురువారం వరకూ కురిసిన వర్షాలకు ఇటీవల వేసిన ఆకుమడులు నీట మునిగి పోవడంతో రైతులు ఆందోళన చెందారు. వ్యవసాయాధికారులు కూడా గ్రామాల్లో పర్యటించి నారుమడుల్లో నిలిచిన నీటిని బయటకు తోడేయాలని సూచించారు. దీంతో శుక్రవారం మబ్బులుగా ఉన్నా శనివారం రోజంతా ఎండగా ఉండడంతో నారుమడుల్లో నిలిచిన నీటిని బయటకు తోడేశారు. చేలల్లో కూడా నీరు నిలబడి ఉండడంతో దుక్కులు దున్నేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. మండలంలో సుమారు 1198 ఎకరాల్లో సార్వా సాగు చేపట్టగా ఇప్పటి వరకూ 79 ఎకరాల్లో నారుమడులు వేసుకోగా, 65 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేసుకున్నారని అధికారులు పేర్కొంటున్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

పాలకోడేరు: పేకాడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. మోగల్లు శివారులో పేకాట ఆడుతుండగా శనివారం స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 6 సెల్ ఫోన్లు, రూ.25,500 నగదు స్వాధీన పరుచుకున్నామని ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

వరదను సమర్థంగా ఎదుర్కొంటాం

కలెక్టర్ పి.ప్రశాంతి



దొడ్డిపట్లలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి



మర్రిమూలలలో పర్యటిస్తున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

యలమంచిలి: వరదను సమర్థంగా ఎదుర్కొనేందుకు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. యలమంచిలి మండలంలో వరద ప్రభావితమైన దొడ్డిపట్ల, లక్ష్మీపాలెం, ఏనుగువానిలంక గ్రామాలను శనివారం ఆమె పర్యటించారు. దొడ్డిపట్ల వద్ద గోదావరి ఏటిగట్టు బలహీనంగా ఉండటతో గట్టు పటిష్టం చేయడానికి యుద్ధప్రాతిపదికిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏనుగువానిలంక దగ్గర కాజ అవుట్ ఫాల్ స్లూయిజ్ తలుపులు సక్రమంగా మూసుకోకపోవడంతో వరద నీరు గోదావరిలో నుంచి డ్రెయిన్ లోనికి వస్తుంది. స్లూయిజ్ తలుపులను పరిశీలించిన కలెక్టర్ మరమత్తులకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరద పరిస్థితిపై వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. వరద వల్ల ప్రజలు ఎవరూ ఇబ్బందికి గురి కాకూడదని, డబ్బుకు వెనకాడకుండా పటిష్టంగా సహాయక చర్యలు తీసుకోవాలని చెప్పారన్నారు. ఆయన ఆదేశాలకు అనుగుణంగా వరద పెరిగితే లంక గ్రామాలలో పునరావాస కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు ఆమె చెప్పారు. కనకాయలంక, పెదలంక గ్రామాలకు అంబేడ్కర్ కోనసీమ జిల్లా తాటిపాక హైస్కూల్‌లోను, దొడ్డిపట్ల మత్స్యకాలనీ వాసులకు దొడ్డిపట్ల హైస్కూల్‌లోనూ పునరావాస కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు చేశామన్నారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, వికలాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైద్యం అవసరమైన వారిని వైద్య కేంద్రాలకు తరలించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కనకాయలంక కాజ్‌వే మునిగిపోవడంతో గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. పశువుల రక్షణ కోసం పశు వైద్య శిబిరం కూడా నెలకొల్పినట్లు కలెక్టర్ వివరించారు. ఆమె వెంట నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, గోదావరి డెల్టా ధవళేశ్వరం చీఫ్ ఇంజనీర్ ఆర్.సతీష్ కుమార్, ఎస్ఈ జి.శ్రీనివాసరావు, మండల ప్రత్యేక అధికారి బి.వెంకటరమణ, డీఎంహెచ్ఓ డాక్టర్ డి.మహేశ్వరరావు, డీపీఓ జీవికే మల్లిఖార్జునరావు, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి బి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ఎ.రామస్వామి, తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.



కాజ అవుట్ ఫాల్ స్లూయిజ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి



నకాయలంకలో వరద నీటిలో మునిగిన ప్రధాన రహదారి



పుచ్చలంకలో బాధితులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

'గడపగడపకు'తో గ్రామాల్లో సమస్యల పరిష్కారం

- ప్రత్యేక నిధుల కేటాయింపుతో పనుల వేగవంతం
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు



పెనుమంచిలిలో నిర్మించిన రహదారి



జిలం చెరువులో నిర్మించిన రహదారి



జుత్తిగలో నిర్మించిన డ్రెయిన్

పెనుగొండ: గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు పరవళ్లు తొక్కుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటి గడపకూ వెళ్లి సమస్యలు తెలుసుకోవడంతో పాటు, వారికి అందించిన సంక్షేమం వివరించడానికి అత్యంత ప్రతిష్టాత్మకంగా గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించాలని నాయకులకు సూచించారు. అలాగే సమస్యల పరిష్కారానికి సచివాలయం పరిధిలో రూ.20 లక్షలు కేటాయించారు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. ఆచంట నియోజకవర్గంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు 149 రోజుల పాటు గడపగడపకూ మన ప్రభుత్వంలో పాల్గొని నియోజకవర్గంలో ప్రతీ ఇంటికి వెళ్లి వారి బాగోగులు అడగడంతో పాటు, ఆయా ప్రాంతాల్లోని రహదారి, మురుగు డ్రెయిన్ల సమస్యలు పరిశీలించారు. రాష్ట్రంలోనే గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహణలో రెండో స్థానంలో నిలిచారు.

వేగంగా అభివృద్ధి పనులు

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన అనంతరం నియోజకవర్గంలోని ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు మండలాల్లోని 64 సచివాలయాల్లోనూ ఒక్కో నియోజకవర్గంలో రూ.20లక్షలతో ప్రధానంగా నిలిచిన సమస్యలు రహదారి నిర్మాణాలు, మురుగు డ్రెయిన్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు చేశారు. ఇప్పటికే పలు గ్రామాల్లో పనుల నిర్మాణాలకు పూర్తిస్థాయిల అనుమతులు రావడంతో కొన్ని సచివాలయాల పరిధిలో నిర్మాణాలు చేపట్టి పూర్తి చేశారు. మరి కొన్ని ప్రాంతాల్లో నిర్మాణాలకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు పరవళ్లు తొక్కుతున్నాయి. సమస్యలను పరిష్కరించడంతో ప్రజలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

గ్రామాల్లో వేగంగా అభివృద్ధి



గడపగడపకూ మన ప్రభుత్వం నిధులతో గ్రామాల్లో వేగంగా అభివృద్ధి పనులు చేస్తున్నాం. మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి ప్రజలు తీసుకొచ్చిన ప్రధాన సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించడంతో అభివృద్ధి పనులు పూర్తి చేశాం.

– గణేషుల శేషవేణి సుబ్బారావు, సర్పంచ్, పెనుమంచిలి

అభివృద్ధి మార్కు



గడపగడపకూ మన ప్రభుత్వ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి మార్కు కనిపిస్తోంది. ఎస్సీ, బీసీ కాలనీల్లో మురుగు సమస్యకు పరిష్కారం లభించింది, జుత్తిగలో డ్రయినేజీ నిర్మాణాలకు ప్రాధాన్యత నిచ్చారు. మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు కృషితో మురుగు సమస్యకు పరిష్కారం లభిస్తోంది.

– తమనంపూడి వీర్రెడ్డి, సర్పంచ్, జుత్తిగ

పనిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి



కాజ తూర్పులో మాట్లాడుతున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

యలమంచిలి: పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు కోరారు. కాజ తూర్పు గ్రామంలో సర్పంచ్ గుబ్బల వేణుగోపాలస్వామి అధ్యక్షతన శనివారం జరిగిన జగనన్న సురక్ష సభలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యులు చేసిన అవినీతి, లంచగొండితనం వలన ప్రజలు పడిన ఇబ్బందులు గుర్తు చేసుకోమని ఆయన కోరారు. ఇప్పుడు జగనన్న ప్రభుత్వం వచ్చాక వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలన్నీ నేరుగా మీ గుమ్మంలోనికి పైసా అవినీతి లేకుండా వస్తున్నాయన్నారు. సర్పంచ్ గుబ్బల వేణుగోపాలస్వామి మాట్లాడుతూ గ్రామంలో డ్రెయిన్ నిర్మాణానికి, జగనన్న కాలనీల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. రంగనాథరాజు స్పందిస్తూ ఈ రెండు పనులకు నిధులు మంజూరు చేయించడమే కాకుండా శంకుస్థాపన లేదా ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవుతానని చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, చింతలపూడి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, సర్పంచ్‌లు పాలంకి శ్రీనివాసరావు, అనిసెట్టి మల్లిక ఎంపీటీసీ సభ్యులు జిల్లెళ్ల రత్నంరాజు, డేగల సూర్యప్రభ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

చినగోపురంలో పండిత సభలు



ప్రవచనం చేస్తున్న ఆచార్యులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ అష్టభుజలక్ష్మీనారాయణస్వామి (చినగోపురం) ఆలయంలో శ్రీ మదుభయవేదాంత పండిత సభలు నిర్వహించారు. నిర్వాహక కమిటీ సభ్యులు మాజేటి రాజేష్ మాట్లాడుతూ ఈ సభలు ఆలయంలో గత పది సంవత్సరాలు క్రితం ఏర్పాటు చేశామని మళ్లీ ఈ సంవత్సరం నుంచి ప్రారంభించామన్నారు. ఈ సభలు శనివారం, ఆదివారం రెండు రోజులు నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం ఉపన్యాసకులు కిడాంబి వెంకటాచార్యస్వామి రామానుజ అవతారం, భాగవత మంగళాశాసనం, డాక్టర్ ఇ. శేష సింగరాచార్యస్వామి అమలానాదిపిరాన్ – శ్రీరంగని సౌందర్యం, సాయంత్రం కేతః స్థలశాయిస్వామి శ్రీ నారాయణోపనిషత్ సారం, శ్రీపరాశర రఘునాథభట్టర్ స్వామి శ్రీనమ్మాళ్వార్ల రంగనాథానుభవం అనే అంశాలపై ప్రవచనం చేశారు. ఆదివారం ఉదయం వంగల వేంకటాచార్య స్వామి తిరువాశిరియం, కేతః నరసింహన్ స్వామి తిరుమల, ఆళ్వార్ల శరణాగతి పై ప్రవచనం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ జవ్వాజి వెంకట పానకాలు, కార్యనిర్వహణాధికారి పీటీ గోవిందరావు, పండిత సభ కమిటీ సభ్యులు సున్న కోటేశ్వరరావు, కె. చంద్రగుప్త, నాళం కృష్ణ, జి సుధాకరరావు, మాజేటి శాంతి తదితరులు పాల్గొన్నారు.

కంటి సంరక్షణపై శ్రద్ధ అవసరం

సాక్షి, భీమవరం: కంటి సంరక్షణ పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నేత్ర వైద్యురాలు లక్ష్మీప్రసన్న అన్నారు. శనివారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో చినఅమిరం గ్రామ ప్రజలకు ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం జగపతిరాజు మాట్లాడుతూ కళాశాల వ్యవస్థాపకుడు సాగి రామకృష్ణంరాజు జయంతి సందర్భంగా కళాశాల అసోసియేషన్, ప్రసాద్ అండ్ కో సంయుక్తంగా చిన అమిరంలో సేవా కార్యక్రమాల్లో భాగంగా గ్రామస్తులకు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటుచేశామన్నారు. కార్యక్రమంలో సాగి విఠల్‌రంగరాజు, కేవీ మురళీకృష్ణంరాజు, ఆర్.కృష్ణ చైతన్య, కేఎస్‌వీ సత్యనారాయణ పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్ట్‌కు రూ.10 వేల విరాళం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటుచేసే అన్నదానం నిమిత్తం దాతలు రూ. 10 వేలు విరాళం అందజేశారు. శనివారం ఆలయానికి వచ్చిన విశాఖపట్నం జిల్లా సింహాచలానికి చెందిన దాతలు పూసపాటి వెంకట కృష్ణంరాజు, మానస దంపతులు స్వామి వారికి విరాళం అందజేశారు. అనంతరం ఆలయ ట్రస్టీ బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణలు దాతలను శాలువతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

జనార్ధన స్వామి విశేష పూజలు



జుత్తిగలో విశేష అలంకరణలో జనార్ధన స్వామి

పెనుమంట్ర: మండలంలోని జుత్తిగ గ్రామంలో ఉన్న శ్రీజనార్ధన స్వామివారికి శనివారం ఏకాదశి సందర్భంగా తులసి దళాలతో విశేష అర్చన జరిపారు. ఆలయ అర్చకులు ర్యాలివాసుశర్మ, పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో

ముంపు చేల పరిశీలన



మినిమించిలిపాడు గ్రామంలో ముంపు చేలను పరిశీలిస్తున్న ఏఓ జి.సత్యనారాయణ

పోడూరు: మండలంలో వరద తాకిడి ఉన్న మినిమించిలిపాడు, వద్దిపర్రు గ్రామాల్లో శనివారం మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ పర్యటించారు. వరదనీటితో నక్కల డ్రెయిన్ పొంగడంతో ఆయా గ్రామాల్లో నాట్లు వేసిన వరిచేలు నీటమునిగాయి. నీటమునిగిన చేలను వ్యవసాయాధికారి సత్యనారాయణ పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు రామన వీర్రాజు, వడ్లపాటి రాజేంద్రప్రసాద్, వీపీఏలు ప్రభాకర్‌బాబు, అనిల్, రవీంద్ర పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



ఉల్లంపర్రులో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లితో పాటు బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యంతో రక్తహీనత సమస్యలు ఉండవని ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ గుణ్ణం సుజయశ్రీ అన్నారు. పాలకొల్లు మండలం ఉల్లంపర్రు గ్రామ సచివాలయ ఆవరణలో శనివారం రోటరీక్లబ్ ఆఫ్ పాలకొల్లు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులు డా.సుజయశ్రీ పాల్గొని మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. గ్రామంలోని బాలింతలు, గర్భిణీలకు పోషకాహార కిట్స్‌ను రోటరీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పెనుమాక రామమోహన్ రావు, క్లబ్ కార్యదర్శి రావాడ సతీష్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ యిమ్మిడి రాజేష్, డా.ముచ్చర్ల సంజయ్, మద్దాల రాంప్రసాద్, మద్దాల వాసు, పోతాబత్తుల సత్యనారాయణ, కానూరి ప్రభాకరరావు, చందక రాము, శిరిగినీడి రాము పాల్గొన్నారు.

వేములదీవి వెంకన్నకు ప్రత్యేక పూజలు



నరసాపురం రూరల్: మండలంలోని కాపుల కొడప ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి పెద్దింటి అరుణ్ కుమార్ ఆచార్యులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

మణిపూర్‌లో దాడులను అరికట్టాలి



సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని శనివారం నరసాపురం పట్టణంలో ఐక్య క్రైస్తవుల శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ సెంటర్ నుంచి పాస్టర్ రూబిన్ అధ్యక్షతన జరిగిన ప్రారంభమైన ఈ భారీ ర్యాలీ నరసాపురం అంబేద్కర్ సెంటర్ నుండీ ప్రధాన రహదారిలో గాంధీబొమ్మ సెంటర్ మీదుగా శ్రీలక్ష్మీ సెంటర్, పంజా సెంటర్, చర్చిరోడ్డు తదితర ప్రాంతాల మీదుగా సాగింది. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని సబ్‌కలెక్టర్ కార్యాలయ పర్యవేక్షణాధికారి యేడిద శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అడిదెల శరత్, వై.జాన్‌కుమార్, జాన్ కెనడీ, శ్రీధర్, కాకిలేటి మధు, నల్లిమిల్లి జోసఫ్ తదితరులుపాల్గొన్నారు.

మార్టేరులో..

పెనుమంట్ర: మణిపూర్‌లో దాడులను అరికట్టాలని సీఐటీయూ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శనివారం మార్టేరు సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో కొద్దిసేపు రాస్తారోకో చేసి, నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె రాజారామ్మోహన్‌రాయ్, మహిళా నాయకురాళ్లు డి.కల్యాణి, ఎ.అజయ్‌కుమారి, జిల్లా అధ్యక్షులు జేఎన్‌వీ గోపాలం, బి వాసుదేవరావు, కర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వడ్డిగూడెంలో చెత్త తొలగింపు

వీరవాసరం: పారిశుధ్యం సక్రమ నిర్వహణకు సహకరించాలని వడ్డిగూడెం సర్పంచ్ సైదు శ్రీనివాస్ ప్రజలను కోరారు. వడ్డిగూడెం గ్రామంలో పెరుకుపోయిన చెత్త తొలగింపును పొక్లెయిన్‌తో శనివారం చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రం చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని, వర్షాకాలంలో అనారోగ్య సమస్యలు తలెత్తకుండా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్టు శ్రీనివాస్ తెలిపారు.